జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 29 ॥ఆదివారం ॥ 28-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



# రాష్ట్రంలో నిలిచిన అభివృద్ధి

## కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

### మహేశ్వరంలో కార్యకర్తల సమావేశం

### బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్న కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 27**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, మహేశ్వరంలో కనిపిస్తున్న కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమనే నమ్మకం కలుగుతోందన్నారు. మహేశ్వ రంలో మరోసారి సబితా ఇంద్రారెడ్డి విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరబోతోందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని, సంక్షేమ (మిగతా 2వ పేజీలో)

# బ్రహ్మోస్ యూనిట్ పరిశ్రమతో
# పాలమూరు అభివృద్ధి

### సీఎంను కలిసిన ఎమ్మెల్యే

### ఉపాధి అవకాశాలపై ఆశలు

### మౌలిక వసతులు వేగవంతం చేయాలి



దేవరకద్ర నియోజకవర్గంలో ప్రతిపాదిత బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సహకరించినందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరపున సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ప్రాజెక్టు ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమతో మహబూబ్‌నగర్ ప్రాంత అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.



**హైదరాబాద్, జూన్ 27**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటు వల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు అనుబంధ రంగాల్లో కూడా ఉద్యోగాలు పెరుగుతాయని, ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని చెప్పారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో (మిగతా 2వ పేజీలో)

# రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్

### ఏడు రోజులపాటు వర్షాలే

### పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక

### హైదరాబాద్‌లో వర్ష సూచన



**హైదరాబాద్, జూన్ 27**

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన ప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఊరట కలిగించే వార్త చెప్పింది. రుతుపవ నాలు తాజాగా చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో రానున్న ఏడు రోజుల (మిగతా 2వ పేజీలో)



# 16.13 కోట్లతో శంకుస్థాపనలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- తండాలకు మెరుగైన రహదారులు
- వంతెనలతో రవాణా సౌకర్యం

**ఖమ్మం, జూన్ 27**

వర్షపు చినుకులు కురుస్తున్నా అభివృద్ధి పనులు ఆగవని చాటి చెబుతూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ ల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూసుమంచి మండలంలో రూ.16.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ (మిగతా 2వ పేజీలో)



# మహిళా రిజర్వేషన్లపై కవిత పిలుపు

### ఢిల్లీలో భారీ సభ నిర్వహిద్దాం

### మహిళా బిల్లు అమలు చేయాలి

### చట్టబద్ధ రిజర్వేషన్లు కావాలి

**హైదరాబాద్, జూన్ 27**

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.హిమాయత్‌నగర్‌లో ఎన్‌సీఆర్ డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన "చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన సభ"లో పాల్గొని ఆమె ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు (మిగతా 2వ పేజీలో)

# జోనాథన్‌తో మోదీ



**జూన్ 27**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వయసున్న భూచర జీవిగా గుర్తింపు పొందిన 'జోనాథన్' అనే తాబేలును సందర్శించా రు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకల కు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించిన మోదీ, ఈ అరుదైన జీవిని చూసి ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భేటీ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.జోనాథన్ సు మారు 194 ఏళ్ల వయస్సు కలిగిన అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు. (మిగతా 2వ పేజీలో)



# సౌదీ ప్రయాణికులకు కొత్త నిబంధనలు

### డిక్లరేషన్ పరిమితి తగ్గింపు

### బంగారం రవాణాపై కఠిన నిబంధనలు

**జూన్ 27**

సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను అమలు చేసింది. మనీలాండ రింగ్ నిరోధక చర్యల్లో (మిగతా 2వ పేజీలో)



### జల ఒప్పందంపై మాజీ మంత్రి

# హరీశ్‌రావు విమర్శలు

### సీఎం తీరుపై తీవ్ర ఆరోపణలు

### రహస్య ఒప్పందం వివరాలు వెల్లడించాలి

**హైదరాబాద్, జూన్ 27**

తెలంగాణ జల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వ హించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుంగభద్ర గేట్ల ప్రారంభో త్సవం సందర్భంగా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం :** అద్భుతమైన శుభకాలం నడుస్తోంది. అనుకున్న కార్యక్రమాలన్నీ దిగ్విజయంగా పూర్తవుతాయి. ఉద్యోగంలో పదోన్నతులతో పాటు విశేష గౌరవం, వ్యాపారంలో ఆశించిన దానికన్నా ఎక్కువ లాభాలు సొంతం అవుతాయి. ఆర్థిక స్థితిగతులు అమాంతం మెరుగవుతాయి, కుటుంబంలో కాస్త ప్రశాంతత పాటిస్తూ శ్రీవేంకటేశ్వర స్వామిని స్మరించండి.

**వృషభం :** అదృష్టలక్ష్మి తలుపు తడుతోంది. ప్రతీ ప్రయత్నం కార్యసిద్ధిని చేకూరుస్తుంది, ఉద్యోగ, వ్యాపారాలలో ఎనలేని గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక పరిస్థితులు అత్యంత అనుకూలంగా మారతాయి. అయితే పెట్టుబడుల విషయంలో మీ అద్భుతమైన సమయస్ఫూర్తిని వాడితే విజయాలు మీకు పాదాక్రాంతం అవుతాయి. మరింత శుభం కోసం శ్రీలక్ష్మీదేవిని ధ్యానించండి.

**మిథునం :** మీ శ్రమకు తగిన అద్భుతమైన ప్రతిఫలం దక్కే సమయం వచ్చేసింది. ఉద్యోగంలో అందరితో కలుపుగోలుగా ఉంటూనే, వ్యాపారంలో లాభాల పంటను సొంతం చేసుకుంటారు. ఆస్తిపాస్తులు వృద్ధి చెందడంతో పాటు బలమైన ధనయోగం పడుతుంది కాబట్టి శ్రీమహాలక్ష్మిని భక్తితో ధ్యానించడం మీకు ఎంతో శుభప్రదంగా మారుతుంది.

**కర్కాటకం :** వృత్తి జీవితంలో శుభ పరిణామాలు మిమ్మల్ని ఎంతో ఉత్సాహపరుస్తాయి. కష్టానికి తగిన అద్భుతమైన గుర్తింపు లభిస్తుంది, అయితే వ్యాపార నిర్ణయాలు, ఖర్చుల విషయంలో కాస్త ఆచితూచి అడుగువేయండి. కుటుంబ సభ్యుల మద్దతుతో ముందడుగు వేయండి. ఇష్టదైవంతో పాటు నవగ్రహ దర్శనం చేసుకుంటే అంతా మంచే జరుగుతుంది.

**సింహం :** వృత్తి జీవితంలో శుభ పరిణామాలు మిమ్మల్ని ఎంతో ఉత్సాహపరుస్తాయి. కష్టానికి తగిన అద్భుతమైన గుర్తింపు లభిస్తుంది, అయితే వ్యాపార నిర్ణయాలు, ఖర్చుల విషయంలో కాస్త ఆచితూచి అడుగువేయండి. కుటుంబ సభ్యుల మద్దతుతో ముందడుగు వేయండి. ఇష్టదైవంతో పాటు నవగ్రహ దర్శనం చేసుకుంటే అంతా మంచే జరుగుతుంది.

**కన్య :** అత్యంత అద్భుతమైన, అదృష్టదాయకమైన శుభకాలం నడుస్తోంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో తిరుగులేని విజయాలు నమోదు చేస్తారు.పెట్టుబడుల ద్వారా కళ్లు చెదిరే ధనలాభం పొందుతారు. కొత్త ఇల్లు, భూమి లేదా వాహనం కొనుగోలు చేసే యోగం బలంగా ఉంది. అష్టలక్ష్మి ధ్యానంతో ఈ ఆనందాన్ని రెట్టింపు చేసుకోండి

**తుల :** అంతులేని పట్టుదలతో ముందడుగు వేయండి, ఎలాంటి లక్ష్యాన్నైనా ఇట్టే సాధించేస్తారు. మధ్యలో ఏవైనా ఆటంకాలు వచ్చినా మీ అపారమైన సహనంతో వాటిని సునాయాసంగా అధిగమిస్తారు. ఆర్థిక విషయాల్లో కాస్త శ్రద్ధ వహిస్తూ వివాదాలకు దూరంగా ఉంటే చాలు. నవగ్రహ శ్లోకాలు పఠించడం వల్ల మీకు అదనపు శక్తి లభిస్తుంది.

**వృశ్చికం :** తిరుగులేని ధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు కార్యసిద్ధిని కచ్చితంగా నెరవేరుస్తాయి. ఉద్యోగంలో వినయంతో వ్యవహరిస్తూనే, వ్యాపారంలో మీ సొంత ఆలోచనలతో అద్భుతాలు సృష్టిస్తారు. ఆర్థిక పరిస్థితి మీకు అనుకూలంగా ఉత్సాహాన్ని ఇస్తుంది. శ్రీలక్ష్మీదేవిని స్మరించడం వల్ల పట్టిందల్లా బంగారమే అవుతుంది

**ధనుస్సు :** ఈరోజు మీకు ఎంతో ఆసక్తికరమైన మిశ్రమ ఫలితాలు ఎదురవుతాయి. ఉద్యోగ, వ్యాపార రంగాలలో కాస్త అప్రమత్తతతో ఉంటూ, పొదుపు మంత్రాన్ని పాటిస్తే ఆర్థికంగా ఎలాంటి ఢోకా ఉండదు. కుటుంబ సభ్యుల అమూల్యమైన సలహాలు మీకు శ్రీరామరక్షగా నిలుస్తాయి. నవగ్రహ స్తోత్రం చదవడం వల్ల మీలో సానుకూలత మరింత పెరుగుతుంది.

**మకరం :** మీ శుభగడియలు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. మీ కొత్త ప్రయత్నాలన్నీ అద్భుతంగా ఫలిస్తాయి. ఉద్యోగంలో విజయాలతో పాటు అఖండ గౌరవం మీ సొంతం అవుతుంది. వ్యాపారంలో వచ్చే చిన్న చిన్న సవాళ్లను చిరునవ్వుతో అధిగమిస్తారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని స్మరిస్తూ ఆర్థికసంబంధ విషయాల్లో కాస్త అప్రమత్తంగా ఉండండి.

**కుంభం :** ఎడతెగని మనోబలంతో, పక్కా క్రమశిక్షణతో అడుగులు వేయండి. ఉద్యోగ, వ్యాపారాల్లో మీదే పైచేయి అవుతుంది. కొత్త పెట్టుబడుల విషయ ంలో కాస్త ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో అవసరం. పాత రుణాలు, అనవసర వివాదాలకు దూరంగా ఉంటూ, నవగ్రహ శ్లోకాలు చదవడం వల్ల మీ ప్రయాణం పూలబాటగా మారుతుంది.

**మీనం :** మీ జీవితంలో విజయ దుందుభి మోగించడానికి కాలం ఎంతో అను కూలంగా మారింది. ఉద్యోగంలో ప్రశంసల జల్లు కురుస్తుంది. అద్భుత మైన ధన, ఆస్తి యోగాలు మీకు కలిసివస్తాయి. వ్యాపారంలో తెలివిగా నిర్ణయాలు తీసుకుంటూ మిత్రుల సహకారాన్ని పొందండి. విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం వల్ల మీకు అంతా శుభమే జరుగుతుంది.



# 16.13 కోట్లతో శంకుస్థాపనలు

(మొదటి పేజీ తరువాయి)

పనులకు శ్రీకారం చుట్టారు. వర్షం పడుతున్నా ప్రజల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగవని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో తండాలు, గ్రామాల ప్రజలు బురద రోడ్లు, వాగుల ఉద్ధృతి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలు బాహ్య ప్రపంచ ంతో సంబంధాలు కోల్పోకుండా ఉండేందుకు రహదారులు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు-గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్లతో, జడ్పీ రోడ్డు నుంచి కొత్తూరు-ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ రహదారులు పూర్త యితే తండాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతా యని తెలిపారు. అలాగే లాల్‌సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో కొండాపురం-మోటాపురం ప్రధాన రహదా రిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రెండు వంతెనల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వర్షాకాలం లో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయ ని అధికారులు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజాధనంతో చేపట్టే ప్రతి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంత్రి పర్యటనలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# సౌదీ ప్రయాణికులకు కొత్త నిబంధనలు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా నగదు,బంగారం,ఆభరణాలు, విలువైన లోహా లు, రత్నాల రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో అమల్లో ఉన్న 60 వేల సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని 40 వేల సౌదీ రియాల్స్‌కు తగ్గించిం ది. కొత్త నిబంధనల ప్రకారం 40 వేల సౌదీ రియాల్స్ లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలను వెంట తీసుకెళ్లే ప్రతి ప్రయాణికుడు కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. ఆయా వస్తువులకు సంబంధించిన కొనుగోలు బిల్లులు లేదా ఇన్ వాయిస్‌లను కూడా సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనల ను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సౌదీ అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన వివరాలు వెల్లడించకపోతే సంబంధిత వస్తువులను 72 గంటల పాటు తాత్కాలికంగా స్వాధీనం చేసుకుంటారు. అనంతర ం విచారణ ఆధారంగా తదుపరి చర్యలు చేపడతారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారిలో మనీలాం డరింగ్ ఉద్దేశం లేదని తేలితే స్వాధీనం చేసుకున్న వస్తువు ల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. అదే తప్పిదం మళ్లీ చేస్తే జరిమానాను 50 శాత ం వరకు పెంచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిం చారు. ఒకవేళ నేరపూరిత ఉద్దేశం ఉన్నట్లు అనుమానిస్తే కేసును నేరుగా పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేస్తారు. దీంతో చట్టపరమైన చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉ ంటుందని స్పష్టం చేశారు. అందువల్ల ప్రయాణికులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# జోనాథన్‌తో మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచంలోనే అత్యంత వయసున్న భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లో స్థానం సంపాదించింది. వయసు పెరగడంతో కంటి చూపు, వాసన శక్తి కొంత తగ్గినప్పటికీ, ప్రస్తుతం ఆరోగ్యంగానే జీవిస్తోందని అధికారులు తెలిపారు. జాతీయ బొటానికల్ గార్డెన్స్ లో పర్యటించిన ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ఒక మొక్కను కూడా నాటారు. ప్రకృతి సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉ ందనే సందేశాన్ని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సెషెల్స్ అధికారులు కూడా పాల్గొన్నారు. భారత్-సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవడం వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి.

# ..మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర జల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నీ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై 35 టీఎంసీల సామర్థ్యంతో నవలి రిజర్వాయర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టాలని ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా మొత్తం 55 టీఎంసీల నీటిని నిల్వ చేయడం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే శ్రీశైలం జలాశయానికి వచ్చే నీటి ప్రవాహం తగ్గి రాష్ట్రంలోని పలు సాగునీటి పథకాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి, రాష్ట్ర ఇంజినీర్లను లోపలికి అనుమతించకుండా బయటే ఉంచారని హరీశ్‌రావు ఆరోపించారు. ముగ్గురు ముఖ్యమంత్రులు, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి మాత్రమే పాల్గొన్న సమావేశంలో ఎలాంటి చర్చలు జరిగాయో రాష్ట్ర ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రహస్యంగా కుదిరినట్లు చెబుతున్న ఒప్పందం వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు.

# ..మహబూబ్‌నగర్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పాటు రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కోరారు. ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూల ంగా స్పందించినట్లు సమాచారం. ప్రాజెక్టు అమలుకు అవ సరమైన చర్యలు వేగంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా అన్ని ప్రక్రియలు పూర్తి చేసేలా అధికారులకు తగిన సూచనలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటు వల్ల దేవరకద్రతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయ ని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశము ందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో రైతులు, ప్రజ ల్లో ఆనందం నెలకొంది. వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకార ం శనివారం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే హనుమకొండ, జయశంకర్ భూపాల పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సం గారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపు లతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకా శముందని అధికారులు తెలిపారు. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని, పంటలను రక్షించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కూడా సూచనలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో తెలంగాణకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జులై 2 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నట్లు అంచనా వేసింది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. అయితే దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురిసే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. రాజధాని హైదరాబాద్‌లో కూడా వాతావరణంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా ఉండటంతో నగరవాసులు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు ప్రారంభమై, సాయంత్రం తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు.

# రాష్ట్రంలో నిలిచిన అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, కేసీఆర్ కిట్, గురుకుల విద్య, విద్యుత్ రంగం, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభి వృద్ధిలో కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. పదేళ్లలో తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దామని చెప్పారు. రైతులకు యూరియా కొరత, రైతుబంధు అమలు, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. వంద రోజుల హామీలు, మహిళలకు ఆర్థిక సాయం, రైతులకు ఇచ్చిన హామీలు అమలుకాలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి ఇప్పుడు అదే భూములతో కొత్త పేర్లతో ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఫార్మా సిటీ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. రైతుల నుంచి సేకరించిన భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని విమర్శించారు. భవిష్యత్ నగరాల పేరుతో భూములపై దృష్టి సారించిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు పాలనలో సుదీర్ఘ అనుభవం ఉందని, ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని, రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, పార్టీ నాయకులు క్యామ మల్లేష్, కార్తీక్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో..

**ఖమ్మం, జూన్ 27**

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం భానాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేష్‌ను లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు చేసేందుకు రూ. 25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదుదారు ఇచ్చిన సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని ఈ ఆపరేషన్ నిర్వహించారు. నిందితుడు లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారులు పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత పత్రాలను పరిశీలించి కేసు నమోదు చేశారు. అరెస్టు అనంతరం నిందితుడిని విచారించిన అధికారులు, లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా ఆయనను వరంగ ల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజ రుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# మహిళా రిజర్వేషన్లపై కవిత పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

చేయించేందుకు దేశవ్యాప్తంగా మహిళలు ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ సభ నిర్వహించాలని ప్రతిపాదించారు. మహిళల శక్తిని దేశానికి చాటిచెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. బిల్లు అమలు చేయకపోతే మహిళలంతా ఓటుతో తమ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో మహిళలు కీలక స్థానాల్లో ఉన్నప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు. అందుకే మహిళలకు చట్టబద్ధంగా 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి కొత్త తరం మహిళా నాయకులను తయారు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

# శ్వేత

## సంపాదకీయం

**ఆదివారం 28-6-2026**

# ప్రజల్లో ప్రశ్నించే తత్త్వం చచ్చిపోయిందా ?

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయకృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ధి కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు.

మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో దృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది.

విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# స్క్రీన్‌ప్లే మాంత్రికుడు కె. భాగ్యరాజ్ కన్నుమూత

**చిత్ర పరిశ్రమలో నిండిన విషాదం..**

**గుండెపోటుతో చెన్నైలో తుదిశ్వాస**



చెన్నై, జూన్ 27: భారతీయ చలనచిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా కోలీవుడ్‌లో ఒక అద్భుతమైన శకం ముగిసింది. తన విలక్షణమైన స్క్రీన్‌ప్లే మ్యాజిక్‌తో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటుడు, దర్శకుడు, కథా రచయిత కె.భాగ్యరాజ్ (73) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో చిత్రపరి శ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. 75 సినిమాల్లో నటుడిగా మెప్పించిన భాగ్యరాజ్, 25 అద్భుతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయనకు భార్య తరువాయి పూర్ణిమ, కుమారుడు శాంతను, కుమార్తె శరణ్య ఉన్నారు.

**సహాయ నటుడి నుండి 'స్క్రీన్‌ప్లే కింగ్' వరకు..**

కృష్ణస్వామి భాగ్యరాజ్ 1953లో తమిళనాడులో జన్మించారు. సినీరంగంపై ఉన్న ఆసక్తితో దర్శకులు జి.రామకృష్ణన్, భారతీరాజాలకు అసిస్టెంట్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. భారతీరాజా చిత్రాలకు అద్భుతమైన స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశారు. తమిళ సినిమా '16 వెయతినిలె (తెలుగులో పదహారేళ్ల వయసు)'లో తొలిసారి వెండితెరపై సహాయ నటుడిగా కనిపించిన ఆయన, 1979లో 'సువరిల్లద చిత్తిరంగల్' అనే చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు.

ప్రేమ, మధ్యతరగతి కుటుంబాల ఎమోషన్స్, హ్యూమర్‌ను సరికొత్తగా మిక్స్ చేస్తూ ఆయన సినిమాలు మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మన పక్కింటి అబ్బాయిలాంటి పాత్రలతోనే ఆయన ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. నటి ఊర్వశి, ఆమె సోదరి కల్పనలను ఇండస్ట్రీకి పరిచయం చేసింది ఆయనే.

బహుముఖ ప్రజ్ఞాశాలి.. రీమేక్‌ల రారాజు

భాగ్యరాజ్ కేవలం నటుడు, దర్శకుడిగానే గాక, కథా రచయితగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటారు. 1983లో వచ్చిన ఐకానిక్ చిత్రం 'ముందనై ముడిచ్చు' (తెలుగులో 'మూడు ముళ్లు') చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2014లో సైమా జీవిత సాఫల్య పురస్కారం లభించింది.

ఆయన రాసిన ఎన్నో అద్భుతమైన కథలు హిందీ, తెలుగు, కన్నడ వంటి ఇతర భాషల్లో రీమేక్ అయి ఘనవిజయం సాధించాయి. అమితాబ్ బచ్చన్ నటించిన ఆఖరి రాస్తా, అనిల్ కపూర్ నటించిన 'వో 7 దిన్' చిత్రాలకు ఆయనే కథ అందించారు. ఇటీవలే తెలుగులో వచ్చిన '35 చిన్న కథ కాదు, కుబేర' వంటి చిత్రాల్లో కూడా ఆయన కీలక పాత్రలు పోషించి మెప్పించారు. స్క్రీన్‌ప్లే మాంత్రికుడిగా పేరుగాంచిన భాగ్యరాజ్ మృతి తమిళ చిత్రసీమకు తీరని లోటు.

**ప్రముఖుల ప్రత్యేక నివాళులు**

మొన్నే కలిశా.. అంతలోనే విషాదం: మెగాస్టార్ చిరంజీవి

"ఆయన మృతి వార్త విని నా హృదయం ముక్కలైంది. గురువారం నటి ఖుష్బూ కుమార్తె పెళ్లి వేడుకలో మేమిద్దరం కలిశాం. సరదాగా జోకులు వేసుకుంటూ ఫొటోలు తీసుకున్నాం. భాగ్యరాజ్ ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఉండేవారు. ఆయన మరణించారనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. టాలెంటెడ్ దర్శకుడు, అద్భుతమైన స్క్రీన్‌ప్లే రచయిత, గొప్ప నటుడు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి."

**చెరగని ముద్ర: పవన్ కళ్యాణ్**

ప్రముఖ దర్శకులు, నటులు, రచయిత కె.భాగ్యరాజ్ గారు కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భవంతుణ్ని ప్రార్థిస్తున్నా. రచయితగా, సహాయ నటుడిగా సినీ జీవితాన్ని ప్రారంభించిన భాగ్యరాజ్ గారు 'స్క్రీన్‌ప్లే కింగ్'గా ఇండియన్ సినిమాలో చెరగని ముద్ర వేశారు. ప్రేమ, కుటుంబ కథలను ఆయన మలచిన విధానం ఒక తరం ప్రేక్షకులను మెప్పించింది. ఈ విషాద సమయంలో భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

**చాలా కష్టపడి ఎదిగారు: సుమన్**

భాగ్యరాజ్ నాకు మంచి స్నేహితుడు. తెలుగు సినిమా ఇండస్ట్రీకి రావడానికి ముందు నేను ఆయన దర్శకత్వంలో నటించాను. ఆయన చాలా కష్టపడి ఎదిగారు. ఆయన మన మధ్య లేరనే విషయాన్ని నేను నమ్మలేకపోతున్నా.

**చిత్ర పరిశ్రమకు తీరని లోటు: విశాల్**

భాగ్యరాజ్ గారి ఆకస్మిక మరణ వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. దిగ్గజ దర్శకుడిని కోల్పోవడం మన సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఈ కష్ట సమయంలో దేవుడు వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలి.



# అఫ్ఘానిస్థాన్‌లో భారీ భూకంపం

**రిక్టర్ స్కేల్‌పై 6.2 తీవ్రత**

**దిల్లీ, జమ్మూకశ్మీర్‌లోనూ ప్రకంపనలు!**

**అఫ్ఘాన్‌లోని జుర్మ్‌కు సమీపంలో భూకంప కేంద్రం**

**ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు**

కాబూల్/న్యూఢిల్లీ, జూన్ 27: అఫ్ఘానిస్థాన్‌లో శనివారం సాయంత్రం భారీ భూకంపం సంభవించింది. హిందూకుష్ పర్వత ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ అధికారికంగా వెల్లడించింది. అమెరికా జియోలాజికల్ సర్వే సమాచారం ప్రకారం.. ఈశాన్య అఫ్ఘానిస్థాన్‌లోని జుర్మ్ నగరానికి దక్షిణంగా సుమారు 43 కిలోమీటర్ల దూరంలో, భూగర్భంలో 215 కిలోమీటర్ల సుదీర్ఘ లోతులో ఈ భూకంప కేంద్రం కేంద్రీకృతమైంది. భూకంపం భూమి లోపల అత్యంత లోతులో సంభవించడం వల్ల ఉపరితలంపై దీని విధ్వంసక ప్రభావం చాలా తక్కువగానే ఉంటుందని, భూకంప శాస్త్రవేత్తలు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి అఫ్ఘానిస్థాన్‌లో ఎలాంటి భారీ నష్టం వాటిల్లినట్లు సమాచారం అందలేదు.మరోవైపు, అఫ్ఘానిస్థాన్‌లో వచ్చిన ఈ భూకంపం కారణంగా భారత్, పాకిస్థాన్, చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్ దేశాల్లోని పలు ప్రాంతాల్లో ఒకే సమయంలో బలమైన భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీని ప్రభావంతో భారతదేశంలోని జమ్మూకశ్మీర్ సహా దేశ రాజధాని దిల్లీ, దాని పరిసర జాతీయ రాజధాని ప్రాంతాలలో భూమి కొద్దిసేపు కంపించింది. ఉన్నట్టుండి భూమి అకస్మాత్తుగా కంపించడంతో జమ్మూకశ్మీర్ లోయలోని ప్రజలు, దిల్లీ వాసులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఉత్తర భారతదేశంలో ఎక్కడా కూడా ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించలేదని, పరిస్థితులపై నిరంతరం నిఘా ఉంచామని స్థానిక విపత్తు నిర్వహణ అధికారులు స్పష్టం చేశారు.



# వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్

**విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక ప్రకటన!**

**రెండోసారి దేశాధ్యక్షుడయ్యాక ట్రంప్‌కు ఇదే తొలి భారత పర్యటన**

వాషింగ్టన్, జూన్ 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలోనే భారతదేశంలో పర్యటించనున్నారు. వచ్చే ఏడాదిలో ఈ ప్రతిష్టాత్మక పర్యటన ఉండే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధికారికంగా వెల్లడించారు. భారత్–అమెరికా దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడిన ఆయన.. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను, దౌత్యపరమైన అంశాలను ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను స్వయంగా భారతదేశానికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు; డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌లో పర్యటించనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. అమెరికాకు భారతదేశం అత్యంత సన్నిహిత, నమ్మకమైన అంతర్జాతీయ భాగస్వామి అని రూబియో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య వ్యక్తిగతంగానూ, రాజకీయంగానూ అత్యంత బలమైన అనుబంధం ఉందని, అంతర్జాతీయ దౌత్యపరంగా వారిద్దరి బంధం ఇరు దేశాలకూ ఎంతో ఉపయోగకరంగా మారిందని మార్కో రూబియో అభిప్రాయపడ్డారు. ఇటీవల ఫ్రాన్స్ వేదికగా జరిగిన జీ7 సదస్సులో పీఎం మోదీ, ట్రంప్‌లు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల గురించి విస్తృతంగా చర్చించారని.. ఇరుదేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న వాణిజ్య పరమైన చర్చలు త్వరలోనే విజయవంతంగా ముగియనున్నాయని ఆయన వెల్లడించారు; ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాను మరింత పెంచడానికి, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి భారత్–అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయని, చమురును భారీగా శుద్ధి చేయగల అద్భుతమైన సాంకేతిక సామర్థ్యం ఉన్న అతికొద్ది దేశాలలో భారత్ కూడా ఒకటిగా నిలిచిందని రూబియో కొనియాడారు.

# ప్రభుత్వ పథకాలు లబ్ధిదారునికి అందాలి

## అది అధికారుల బాధ్యత

**సూర్యాపేట జూన్ 27**

ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర అగ్రికల్చర్ కోఆపరేటివ్ సెక్రటరీ, మార్కెటింగ్ డైరెక్టర్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి కే సురేంద్రమోహన్ అన్నారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందుతున్నది, లేనిది తెలుసుకోవడంతోపాటు, అలాగే వివిధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను తెలుసుకునేందుకు 99 రోజులపాటు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు లబ్ధిదారులకు అందాలంటే అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అప్పుడే లబ్ధిదారులకు సరైన విధంగా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం తదితర రంగాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుండి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం, ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి అధికారులు చేయాల్సిన అవసరం ఉందన్నారు ఎక్కడైతే ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందుతుందో అక్కడ పేదరికం ఉండదని అన్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్ తో పాటు, అధికారులందరినీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని, ఎట్టి పరిస్థితులలో లబ్ధిదారున్ని మర్చిపోకూడదని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతో ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆయా శాఖల అధికారులు రొటీన్ పనుల పై కాకుండా అదే పనిని ఇతర ప్రాంతాలలో ఎలా చేస్తున్నారో అధ్యయనం చేసుకొని సాధ్యమైనంత ఎక్కువ లాభాన్ని ప్రజలకు చేకూర్చేందుకు కృషి చేయాలని, ఇందుకుగాను వినూత్నంగా ఆలోచన చేయాలని తెలిపారు. ఇందుకు సమర్థవంతమైన షెడ్యూల్ ను, ప్రణాళికను రూపొందించుకోవాలని, అప్పుడే ఆశాజనక ఫలితాలు వస్తాయని చెప్పారు . పథకాల అమలులో వివిధ శాఖలు సమ్మిళితంతో అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్య , వైద్యం ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలులో







జిల్లాలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ ప్రపంచంలో ఎక్కడ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన - ప్రణాళిక అనే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందని, నిధులు లేకున్నప్పటికీ జిల్లాలో సమర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించారని అన్నారు. అధికారులు ఆర్థిక విషయాలు పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ పథకాలను అమలు చేయాలని , ప్రభుత్వం ఏ ఉద్దేశంతో అయితే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందో ఈ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో వందకు వంద శాతం విజయవంతం అవ్వడం చాలా సంతోషంగా ఉందని, ఇదే విధంగా ముందు ముందు జిల్లాలో ఏ కార్యక్రమాన్ని పెట్టినా అందరూ సమిష్టిగా కలిసి విజయవంతం చేయుటకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు వ్యవసాయ శాఖ యాప్ ల మీద అవగాహన కల్పించాలని, ప్రజలు అనారోగ్య బారిన పడకుండా రైతులు ఆర్గానిక్ పంటలు పండించే విధంగా వ్యవసాయ, హా ర్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించాలని, వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేసి రైతులు ఏ విత్తనాలు, ఏ ఎరువులు వాడితే లాభంగా ఉంటుందో అవగాహన కల్పించాలని, రైతు వేదికలలో రైతులకు సన్న వడ్ల సీడ్, ఫెర్టిలైజర్స్ అందించాలని, దీనికి నోడల్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ ఉంటారని, రైతులకు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించాలని, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం, యూరియా యాప్, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18001237157 ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. అదే విధంగా సంక్షేమ హాస్టల్స్ లో సంక్షేమ అధికారులు వారానికి ఒక సారి సందర్శించి బడ్జెట్ మీద ఆధారపడకుండా మానవతా దృక్పథంతో ఫ్యాన్లు రిపేర్ చేయించడం, చెప్పులు లేని విద్యార్థులకు చెప్పులు కొనివ్వాలని సంక్షేమ అధికారులకు సూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా సూర్యాపేట జిల్లాలో 99 రోజులపాటు ఆయా అంశాల వారిగా చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను జిల్లా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్న ప్రత్యేక అధికారి కి జిల్లా కలెక్టర్ తో పాటు, జిల్లా ఎస్పీ కె నరసింహ ఇతర అధికారులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రత్యేక అధికారి తిలకించి చాలా బాగా చేశారని అభినందించారు. చివరిగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిని సత్కరించి తమరు సూచించిన ఆదేశాలు జిల్లాలో తప్పకుండా అమలు చేస్తామని, ముందు ముందు ప్రభుత్వం ఏ కార్యక్రమాలు ప్రవేశపెట్టినా విజయవంతం చేయడం జరుగుతుందని, తమరి ఆదేశాలు తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జెడ్పి సీఈవో శిరీష, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఆర్డిఏ సన్యాసయ్య , డిఇఓ అశోక్, సిపిఓ కిషన్ నాయక్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.



## ముగిసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ భూముల వేలంపాట

**చిలుకూరు జూన్ 27**

శనివారం శ్రీ కోదండరామస్వామి ఆలయ భూములను రెండు సంవత్సరములకు గాను బహిరంగ వేలం పాట నిర్వహించడం జరిగింది. దీనిలో 17 మంది పాల్గొనగా వివిధ సర్వే నెంబర్ల వేలం ద్వారా కేతిరెడ్డి నాగిరెడ్డి, దుర్గాప్రసాద్, చిలువేరు ఆంజనేయులు, ఆరే రామారావు వేలం ద్వారా భూములను దక్కించుకున్నారు. మొత్తంగా 9, 86,000 దేవాలయ భూముల ద్వారా సమకూరింది. గతంలో కంటే రెండు లక్షలు అదనంగా రాబడి జరిగిందని ఆలయ మేనేజర్ కొంకపాక మృత్యుంజయ శాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ గంగిరెడ్డి అచ్చిరెడ్డి, మాజీ ధర్మకర్తలు బాలే బోయిన వెంకన్న, సాగి గణేష్, నాగిరెడ్డి రామిరెడ్డి, కందుకూరి సంధ్య ఆలయ పూజారి సిరికొండ పృథ్వీ, ప్రత్యేక అధికారి చలపతిరావు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు



## సన్న వరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

### కేసారం రైతు వేదికలో విత్తన మేళా నిర్వహణ

**సూర్యాపేట, జూన్ 27**

సూర్యాపేట మండలంలోని కేసారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం రైతుల కోసం విత్తన మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు వానాకాలం సాగుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వానాకాలం--2026 సీజన్‌లో వ్యవసాయ శాఖ ఏడు రకాల సన్న వరి వంగడాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ రకాల విత్తనాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందజేస్తుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సన్న రకాల వరి సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. మండల పరిధిలోని రైతు వేదికల ద్వారా ఈ నెల 30వ తేదీ వరకు విత్తనాల పంపిణీ కొనసాగుతుందని, అవసరమైన రైతులు సకాలంలో విత్తనాలు పొందాలని కోరారు. ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా రైతులు ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను పొందాలని సూచించారు. ఒకేసారి దుకాణాల వద్దకు వెళ్లకుండా క్రమపద్ధతిలో ఎరువులు తీసుకోవడం వల్ల రద్దీ తగ్గడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ యూరియా పక్కదారి పట్టకుండా నివారించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం అవసరాన్ని వివరిస్తూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతో పాటు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జూన్ 30న తెలంగాణ రాష్ట్ర కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

### బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ పిలుపు

**సూర్యాపేట, జూన్ 27**

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల అసలు విద్యా ధ్రువపత్రాలను (ఒరిజినల్ సర్టిఫికెట్లు) నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. దీంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వాలను



ప్రశ్నించే స్థాయికి చేరుకోకుండా చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వ ర్యంలో ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జూన్ 30న నిర్వహించే రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌లో విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బోనగిరి సతీష్, నారా బోయిన లోకేష్, అజయ్, వంశీ, ధనుష్, జీవన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పక్కన అనుమానాస్పద స్థితిలో రెండు మృతదేహాలు

**సూర్యాపేట, జూన్ 27**

సూర్యాపేట జిల్లా పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు అనుమానాస్పద పరిస్థితుల్లో లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించి, పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా ప్రమాదమా, లేక మరేదైనా కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంఘటన జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరిస్తూ, సమీప ప్రాంతాల సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. మృతుల గుర్తింపునకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.




## రానున్న రాజ్యాధికార సమరభేరి - చలో భువనగిరి సభకు కోరుట్ల సిఐకి ఆహ్వానం

**జూన్ 27**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల హన్మాండ్లు సుచన మేరకు సమరభేరి సభ లక్ష్యాలు, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధన, బీసీ-ఎస్సీ-ఎస్టీ-మైనారిటీల ఐక్యతపై వివరించారు. ఈ సందర్భంగా కోరుట్ల సిఐ లక్ష్మీ నారాయణ సానుకూలంగా స్పందించి, రాజ్యాధికార సమరభేరి విజయవంతానికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కోసిగంటి జ్యోతి, మెట్‌పల్లి మండల అధ్యక్షులు దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల నాయకులపై నమోదైన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి

### ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ యువజన సంఘం

**సూర్యాపేట, జూన్ 27**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రివేణి ప్రైవేట్ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టిన **SFI, PDSU, PSU**, జనసేవా సమితి, బీసీ విద్యార్థి సంఘాల నాయకులపై నమోదైన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ యువజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టైలు, బెల్టులు తదితర స్టేషనరీ వస్తువులను విక్రయిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల పై అధిక ఆర్థికభారం మోపుతున్నాయని విమర్శించారు. ఇటువంటి అక్రమాలను అడ్డుకోవాలని విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టగా, నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, వారి ఫిర్యాదును ఆధారంగా చేసుకుని విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం, బైండోవర్ చర్యలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన పాత్రపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు




చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్రివేణి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేయించిన కేసులను ఎలాంటి షరతులు లేకుండా వెంట నే వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాషిపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనిగా సంతోష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పోరెళ్ల విప్లవ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు దారావత్ శివ, చామకూరి మహేందర్, కొలికపంగు వాసు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ బిల్లును రద్దు చేయాలి - జూలై 1 గ్రామీణ సమ్మెను విజయవంతం చేయండి

## సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నేతల పిలుపు



**సూర్యాపేట, జూన్ 27**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ రామ్‌జీ బిల్లు గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించే విధంగా ఉందని, ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ జూలై 1న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట నిర్వహించే గ్రామీణ సమ్మె, ధర్నాలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ఎలాంటి చర్యలనైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే పని కోరిన కూలీలకు తగినంత ఉపాధి కల్పించడం లేదని, చేసిన పనులకు కూలి చెల్లింపులు వారాలు, నెలల తరబడి ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా, వాటికి అనుగుణంగా కూలి రేట్లు పెరగకపోవడంతో ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం, పనిదినాలను పరిమితం చేయడం, సాంకేతిక నిబంధనల పేరుతో కూలీలను ఇబ్బందులకు గురిచేయడం వల్ల గ్రామీణ పేదల జీవనోపాధి సంక్షోభంలో పడిందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో వీబీజీ రామ్‌జీ బిల్లు అమల్లోకి వస్తే గ్రామీణ పేదల ఉపాధి అవకాశాలు మరింత తగ్గిపోవడంతో పాటు ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామీణ కుటుంబాల ఆదాయం తగ్గి, వలసలు పెరిగి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్‌జీ బిల్లును వెంటనే రద్దు చేసి, ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, పని కోరిన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలని, పెండింగ్ కూలి బకాయిలను వెంటనే చెల్లించాలని, పథకానికి తగిన నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 1న జరిగే గ్రామీణ సమ్మె, ధర్నాల్లో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, మహిళలు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘ నేతలపై కేసులు ఉపసంహరించుకోవాలి

## బెంజారపు రమేష్ గౌడ్



**సూర్యాపేట, జూన్ 27**

విద్యార్థి సంఘ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని రాష్ట్ర ఓబీసీ నాయకులు బెంజారపు రమేష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయాలకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, వాటిపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల సమస్యల కోసం పోరాడుతున్న విద్యార్థి సంఘ నాయకులపై కేసులు నమోదు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యార్థులకు, విద్యార్థి సంఘాలకు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరిచే హక్కు రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. ఆ హక్కును అణచివేసే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విద్యార్థి సంఘ నాయకులపై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పాఠ్యపుస్తకాల విక్రయాలు, ఇతర అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర స్థాయి నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు చేపడతామని బెంజారపు రమేష్ గౌడ్ హెచ్చరించారు.

# బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం పోయింది

## కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసే వ్యాఖ్యలను ప్రజలు ఇక నమ్మే పరిస్థితిలో లేరని, ఆ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పూర్తిగా కోల్పోయిందని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల పరిగిలో కేటీఆర్ నిర్వహించిన సమావేశం పూర్తిగా విఫలమైందని అన్నారు. చిన్న ఫంక్షన్ హాల్‌ను కూడా నింపలేక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, సమావేశానికి వచ్చిన పార్టీ కార్యకర్తలు మధ్యలో వెళ్లిపోకుండా వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరిగి నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, అలాంటి పరిస్థితుల్లో అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని రామ్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిగిలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో పరిగిలో ఒక్క డబుల్ బెడ్‌రూ మ్ ఇల్లు కూడా నిర్మించలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో గృహప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల కోట్ల వడ్డీలేని రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా, మహిళా సంఘాల కోసం బస్సులను కొనుగోలు చేసి వాటిని ఆర్టీసీకి లీజుకు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మహిళల సంక్షేమం కోసం ఏం చేశారో కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పేదల ఇళ్ల కూల్చివేతలకు నిరసనగా వామపక్షాల రాష్ట్రవ్యాప్త గృహ హక్కుల ఉద్యమం

**హనుమకొండ, జూన్ 27**

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు శనివారం హనుమకొండలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి వేలాది మంది ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఏకశిలా పార్క్ వద్ద ప్రారంభమైన ర్యాలీ కాళోజీ సెంటర్ మీదుగా సుబేదారి అమరవీరుల స్థూపం వరకు చేరుకుని, అక్కడి నుంచి కలెక్టరేట్ వైపు భారీ ప్రదర్శనగా సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, గడగోని రవి, గుమ్మడి నర్సయ్య, టక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితర వామపక్ష నాయకులు పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అరెస్టులను వ్యతిరేకిస్తూ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసు వాహనాలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సభలో మాట్లాడిన కూనంనేని సాంబశివరావు ప్రభుత్వం పేదలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. పెద్ద ఎత్తున భూకబ్జాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా పేదల గుడిసెలను కూల్చివేయడం అన్యాయమని విమర్శించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా గృహ హక్కుల ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై పేదలు నిర్మించుకున్న గుడిసెలను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కూల్చివేసిన అదే ప్రాంతాల్లో బాధితులకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కూల్చివేతలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీలు తమ తదుపరి ఆందోళన కార్యక్రమాలను ప్రకటించాయి. జూలై 1న హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, జూలై 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించాయి. పేదల గృహ హక్కుల పరిరక్షణ, బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించే వరకు పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.



# జిల్లా కేంద్రంలో పోలీసుల విస్తృత తనిఖీలు

## తనిఖీల్లో పాల్గొన్న యాంటీ నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'

**సూర్యాపేట టౌన్, జూన్ 27**

జిల్లా కేంద్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణా నియంత్రణ లక్ష్యంగా సూర్యాపేట పట్టణ పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో యాంటీ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది, నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' పాల్గొని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. విద్యానగర్, 60 ఫీట్ల రోడ్డు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని టీ దుకాణాలు, పాన్ షాపులు, హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సోదాలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, మాదకద్రవ్యాల నిల్వలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయా అనే కోణంలో నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై కీలక రవాణా కేంద్రంగా ఉన్న సూర్యాపేటలో భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొత్త వ్యక్తుల కదలికలు, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించేందుకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మాదకద్రవ్యాల గుర్తింపులో ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' పాన్ డబ్బాలు, టీ దుకాణాలు, హోటళ్లు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు వెల్లడించారు.

# రూ.1.14 కోట్ల అభివృద్ధి పనులు

**హైదరాబాద్, జూన్ 27**



రామంతాపూర్ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో రూ.1.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందిరానగర్, భారత్‌నగర్, భవానీనగర్ ప్రాంతాల్లో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే స్థానికులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరానగర్‌లో రూ.80 లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, భారత్‌నగర్‌లో రూ.20 లక్షలతో షెడ్ నిర్మాణం, భవానీనగర్‌లో రూ.14 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను ప్రాధాన్య క్రమంలో చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు కమ్యూనిటీ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత మెరుగుపరచడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కాలనీలో ప్రజల సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, కమ్యూనిటీ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అభివృద్ధి పనుల ద్వారా స్థానిక ప్రజలకు మరింత సౌకర్యవంతమైన జీవన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# పొలంబాటతో విద్యుత్ భద్రత

**హుజూరాబాద్, జూన్ 27**

టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని జమ్మికుంట ఉపవిభాగం, చల్లూరు సెక్షన్‌లోని కోర్కల్ గ్రామంలో శనివారం 'పొలంబాట' కార్యక్రమం నిర్వహించారు. డివిజనల్ ఇంజినీర్, సహాయ డివిజనల్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది, రైతులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బందికి 'వన్ మినిట్ సేఫ్టీ ప్రోగ్రామ్' నిర్వహించి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ పనుల నిర్వహణలో తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని, ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు స్పష్టం చేశారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు కూడా విద్యుత్ భద్రతపై ప్రత్యేక సూచనలు చేశారు. ఫ్యూజ్‌లు కాలిపోయినప్పుడు రైతులు స్వయంగా మార్చేందుకు ప్రయత్నించవద్దని, వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ మోటార్ల వినియోగంలో పాటించాల్సిన భద్రతా నియమాలను వివరించారు.

# హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల హక్కుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి

## యూబీఐడీఈఎఫ్

**న్యూఢిల్లీ, జూన్ 27**

దివ్యాంగుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (UBIDEF) ప్రతినిధి బృందం న్యూఢిల్లీలోని దివ్యాంగుల ప్రధాన కమిషనర్ గోవిందరాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి లిలిదివ్యాంగుల హక్కుల చట్టం--2016 (RPwD Act, 2016)ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించింది. ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి పీ.రాజశేఖర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం దేశవ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది. ఉన్నత విద్యలో దివ్యాంగ విద్యార్థులకు కల్పించాల్సిన 5 శాతం రిజర్వేషన్ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ అమలులో లోపాలు, పదోన్నతుల్లో వివక్ష, దివ్యాంగ ఉద్యోగులు మరియు వారి సంరక్షకులకు బదిలీల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలను ప్రస్తావించింది. అదేవిధంగా పెరుగుతున్న వైద్య, పునరావాస ఖర్చులను దృష్టిలో ఉంచుకుని దివ్యాంగులకు ఆరోగ్య బీమా మరియు ప్రయాణ భత్యాలను పెంచాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రజా రవాణా వ్యవస్థలు, డిజిటల్ సేవల్లో మరింత మెరుగైన అందుబాటు (Accessibility) కల్పించాలని కోరింది. దివ్యాంగుల హక్కుల చట్టం అమలును పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం బలమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, చట్టాన్ని అమలు చేయడంలో విఫలమవుతున్న సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని యూబీఐడీఈఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా పీ. రాజశేఖర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం దాతృత్వం కాదని, అది రాజ్యాంగం మరియు చట్టం కల్పించిన హక్కు అని అన్నారు. ప్రభుత్వ సంస్థలు, యాజమాన్యాలు మరింత సున్నితంగా, సమగ్ర దృక్పథంతో వ్యవహరించాలని కోరారు.

# భద్రాచలం ఆలయ పునరుద్ధరణ ప్రారంభం

**భద్రాచలం, జూన్ 27**

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో ఆలయ పునరుద్ధరణ పనులు శనివారం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావుతో కలిసి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ పునరుద్ధరణ పనులు ఆగమశాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా, ఆలయ పవిత్ర తకు భంగం కలగకుండా నిర్వహించాలని అధికారులు, సంబంధిత శాఖలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయంలో చేపట్టే ప్రతి నిర్మాణ దశను వేద పండితుల సూచనల మేరకు శాస్త్రోక్తంగా నిర్వహించాలని సూచించారు. పునరుద్ధరణ పనుల సమయంలో ఆలయ ఆధ్యాత్మికతకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిర్మా ణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనుల కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశా రు. స్వామివారి దర్శనం, నిత్యపూజలు, అర్చనలు యథా విధిగా కొనసాగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.



## జూలై 9న సంగారెడ్డిలో వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా మహాసభ

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేఐజేయూ) సంగారెడ్డి జిల్లా మహాసభ జూలై 9న సంగారెడ్డిలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు (హెల్త్ కార్డులు) మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని చాలా కాలంగా కోరుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆశించిన ఫలితం దక్కలేదని అన్నారు. అలాగే అర్హులైన మిగిలిన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని సంఘం తరఫున ప్రభుత్వాన్ని మరోసారి కోరనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, సంఘ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్‌తో పాటు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కూడా మహాసభకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇదే సందర్భంగా టీయూడబ్ల్యూజేఐజేయూ సంగారెడ్డి జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరై సంఘ ఐక్యతను చాటడంతో పాటు జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘీభావం తెలియజేయాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



## పోలియో చుక్కల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**

ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వే బృందాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 28న జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,137 పోలియో బూత్‌లలో ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి తొలి రోజు మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 1,80,405 మంది 0--5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1,583 మంది ఏఎన్ఎంలు, 904 మంది ఆశా కార్యకర్తలు, 1,505 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 625 మంది ఇతర వాలంటీర్లు, 6 మంది ప్రోగ్రామ్ అధికారులు పాల్గొంటున్నట్లు వివరించారు. వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో నివసించే చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0--5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, మరోసారి వేయించడం ద్వారా చిన్నారులకు పూర్తి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

# ఘనంగా ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్

### జిల్లాలో 3 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం: ఉద్యాన శాఖ

### రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగు వైపు ముందుకు రావాలని ప్రజాప్రతినిధుల పిలుపు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**



సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని డాకూర్ గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడం, రైతులకు ఈ పంటపై అవగాహన కల్పించడం, అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కల నాటకాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాకూర్ గ్రామానికి చెందిన రైతు డాకూరి వెంకటేష్ పొలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించగా, ఆ లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు ఉత్సాహంగా మొక్కలు నాటుతున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ఆయిల్ పామ్ పంటను కొనుగోలు చేసే సౌకర్యం ఉన్నందున రైతులు ఈ పంట సాగుపై దృష్టి సారించాలని సూచించారు. దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన పంటగా ఆయిల్ పామ్‌ను అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, ఉద్యాన అధికారి టి. సమత, హెచ్ఈఓ సంగయ్య స్వామి, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఏరియా మేనేజర్ ఈశ్వర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు శివరామ్, హర్ష, అందోల్ మండలానికి చెందిన రైతులు కిరణ్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

### సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**



అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర ఆదేశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం చట్టరీత్యా నేరమని, వాటికి కఠినమైన శిక్షలు అమలులో ఉన్నాయని వివరించారు. అలాగే విద్యార్థులకు విద్యా హక్కు చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిషేధ చట్టం, బాలల హక్కులు, సంక్షేమం, భద్రతకు సంబంధించిన పలు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ భవిష్యత్తు నిర్మాణం లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైన ప్రతి ఒక్కరికీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారు సంస్థను సంప్రదించి సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు.

# విద్యాసంస్థల అభివృద్ధికి రూ. 5.40 కోట్ల టీజీఐఐసీ సీఎస్ఆర్ నిధులు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**





సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల నుంచి రూ.5.40 కోట్లను మంజూరు చేసినట్లు టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడేలా అవసరమైన అన్ని సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సీఎస్ఆర్ నిధుల కింద సంగారెడ్డి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రూ.4 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులతో కూడిన హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. అదేవిధంగా గర్ల్స్ జూనియర్ కళాశాలలో రూ.75 లక్షలతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించగా, తారా డిగ్రీ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం, భద్రత, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు సంగీత మహేష్, సుష్మిత, రవి నాయక్, శ్రీకాంత్ గౌడ్, ప్రీతి, కో-ఆప్షన్ సభ్యులు బబ్బు, శివుడు, యశోద, సోహైల్, ఆరిఫ్, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరుణ, గర్ల్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సునీత, తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు జులై, 5 లోగా

# దరఖాస్తులు సమర్పించాలి

### జిల్లా వ్యవసాయాధికారి

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పథకం కింద అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ఒక ప్రకటన లో తెలిపారు. 2026 జూన్ 15 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అర్హత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 5, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు తమకు సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీలను, రైతు భరోసా దరఖాస్తు ఫారం ను సమర్పించాలని తెలిపారు.

### సిగాచి ప్రమాద బాధితులకు పూర్తి నష్టపరిహారం

# చెల్లించాలి: సీఐటీయూ

### జూన్ 30తో ఘోర ప్రమాదానికి ఏడాది పూర్తి

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**



పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెంది జూన్ 30తో ఏడాది పూర్తవుతున్నా, బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి నష్టపరిహారం అందలేదని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రమాదానికి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని నిపుణుల కమిటీ నివేదికలు స్పష్టం చేశాయని అన్నారు. ప్రమాదం అనంతరం ముఖ్యమంత్రి ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించారని, కంపెనీ యాజమాన్యం కూడా అదే మేరకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా

### ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలి: బీసీ సంక్షేమ సంఘం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27**




రాష్ట్రంలోని కళాశాల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 30న సంగారెడ్డి కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ప్రభుగౌడ్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, అధికార ప్రతినిధి కుమ్మరి సాయిలు, కోశాధికారి సుధాకర్ గౌడ్, సలహాదారు జగ్గాసింగ్, కార్యదర్శి శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు సాయిబాషా, మహిళా అధ్యక్షురాలు మంజుల మంగ గౌడ్, వడ్ల మానస, వీరమణి మౌనిక, నాయకులు గోలీశ్వర్, వీరేష్ గౌడ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాకౌట్‌కు చేరిన ఈజిప్ట్.. ఇరాన్‌కు నిరాశ

**న్యూయార్క్, జూన్ 26, :**

ఫిఫా ప్రపంచకప్‌లో ఈజిప్ట్ నాకౌట్ దశకు అర్హత సాధించగా, ఇరాన్‌కు నిరాశ ఎదురైంది. గ్రూప్-జీలో జరిగిన కీలక పోరు 1-1తో డ్రాగా ముగియడంతో ఈజిప్ట్ చివరి 32 జట్ల దశలోకి అడుగుపెట్టింది. మ్యాచ్ ప్రారంభమైన ఐదో నిమిషంలో మహమూద్ సబెర్ గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. అనంతరం ఇరాన్‌కు పెనాల్టీ లభించినా దానిని గోల్‌గా మలచ లేకపోయింది. అయితే 14వ నిమిషంలో రమిన్ రజీయన్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత ఇరు జట్లు గెలుపు కోసం తీవ్రంగా పోరాడినా ఫలితం రాలేదు. అదనపు సమయంలో 93వ నిమిషంలో ఖలిజదేహ్ గోల్ చేసినప్పటికీ, వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) ఆఫ్‌సైడ్‌గా నిర్ధారించడంతో గోల్‌ను తిరస్కరించారు. దీంతో మ్యాచ్ 1-1తో ముగియగా, గ్రూప్-జీ నుంచి బెల్జియంతో పాటు ఈజిప్ట్ నాకౌట్






దశకు చేరింది. మూడో స్థానంలో నిలిచిన ఇరాన్ మాత్రం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వరల్డ్‌కప్ స్ట్రీమింగ్ చేస్తున్న 400 అక్రమ వెబ్‌సైట్లు సీజ్

**న్యూయార్క్, జూన్ 27**

ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌లను అక్రమంగా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న సుమారు 400 వెబ్‌సైట్లను అమెరికా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాపీరైట్ చట్టాలను ఉల్లంఘిస్తూ మ్యాచ్‌లను అనుమతి లేకుండా ప్రసారం చేస్తున్న ఈ డొమెయిన్లను గుర్తించి చర్యలు తీసుకున్నట్లు అమెరికా న్యాయ శాఖ వెల్లడించింది. ఫిఫా సంస్థతో పాటు పలు దర్యాప్తు సంస్థలు, అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ అక్రమ వెబ్‌సైట్లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రముఖ ప్రసార సంస్థలు ఎన్‌బీసీ యూనివర్సల్, వార్నర్ బ్రదర్స్ కూడా ఈ దర్యాప్తులో సహకరించినట్లు వెల్లడించారు. అక్రమ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అధికారిక ప్రసార హక్కులు కలిగిన సంస్థలకు భారీ ఆర్థిక నష్టం కలిగించడమే ఈ వెబ్‌సైట్ల ప్రధాన ఉద్దేశమని అమెరికా న్యాయ శాఖ పేర్కొంది. ఈ వెబ్‌సైట్లు కాపీరైట్ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించినట్లు కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో వాటిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ కంప్యూటర్ హ్యాకింగ్, మేధోసంపత్తి పరిరక్షణ విభాగంలో శిక్షణ పొందిన అధికారులు పలు దేశాల్లో దర్యాప్తు చేపట్టి అక్రమ ప్రసార సర్వర్లు, డొమెయిన్లను గుర్తించారు. ముఖ్యంగా పెరూ, బల్గేరియాలో ఈ సర్వర్లు, డొమెయిన్లు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు అక్కడి కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అలాగే క్రొయేషియా, రొమేనియా, పోలాండ్, కొలంబియా



దేశాల్లో కూడా అక్రమ ప్రసారాలకు సంబంధించి పనిచేస్తున్న హ్యాకింగ్ కేంద్రాలను గుర్తించినట్లు అమెరికా న్యాయ శాఖ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ పైరసీని అరికట్టేందుకు అంతర్జాతీయ స్థాయిలో చర్యలు మరింత వేగవంతం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# వ్యాపార రంగంలోకి జొకోవిచ్ కీలక అడుగు

**లండన్, జూన్ 27**

ప్రపంచ టెన్నిస్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్టార్ క్రీడాకారుడు నొవాక్ జొకోవిచ్ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ అంతర్జాతీయ ప్రైవేట్ పెట్టుబడి సంస్థ జనరల్ అట్లాంటిక్‌కు ప్రపంచ వ్యూహాత్మక సలహాదారుగా ఆయనను నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ టోర్నీలో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త బాధ్యతల్లో భాగంగా జొకోవిచ్ సంస్థ ఉన్నతాధికారులు, అనుబంధ సంస్థలు, పెట్టుబడిదారులతో కలిసి పనిచేయనున్నారు. నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, సరికొత్త ఆలోచనలపై తన అనుభవాలను పంచుకోనున్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, శ్రేయస్సు రంగాల్లో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు జొకోవిచ్ అనుభవం, ప్రపంచవ్యాప్త పరిచయాలు ఉపయోగపడతాయని సంస్థ భావిస్తోంది. ఇటీవలి కాలంలో జొకోవిచ్ వ్యాపార రంగంలో కూడా తన పెట్టుబడులను విస్తరిస్తున్నారు. ఆరోగ్య ఉత్పత్తులు, పోషకాహార పదార్థాలు, ఆహార ఉత్పత్తులు, ధరించగలిగే సాంకేతిక పరికరాల రంగాల్లో పలు సంస్థలకు



పెట్టుబడులు పెట్టడంతో పాటు కొత్త సంస్థలను కూడా ప్రారంభించారు. ఈ నియామకంపై స్పందించిన జొకోవిచ్, క్రీడల్లో విజయం సాధించేందుకు అవసరమైన క్రమశిక్షణ, దీర్ఘకాలిక ఆలోచన, నిరంతరం మెరుగుపడాలనే తపనే వ్యాపార విజయానికి కూడా మూలమని పేర్కొన్నారు. అలాంటి విలువలతో ముందుకు సాగుతున్న ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పదిహేనేళ్ల వయసులోనే వృత్తిపరమైన టెన్నిస్‌లో అడుగుపెట్టిన జొకోవిచ్ తన కెరీర్‌లో రికార్డు స్థాయిలో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలుచుకున్నారు. ఒలింపిక్ స్వర్ణ పతకం, ప్రపంచ నంబర్-1 స్థానంలో అత్యధిక వారాలు కొనసాగిన ఘనత, ఎనిమిది సార్లు ఏడాది ముగింపు నంబర్-1 ర్యాంకు, నలభై మాస్టర్స్ వెయ్యి టైటిళ్లు వంటి ఎన్నో అరుదైన విజయాలతో టెన్నిస్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇప్పుడు క్రీడల్లో సంపాదించిన అనుభవాన్ని వ్యాపార రంగంలోనూ వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు.

# వైభవ్‌పై సంగక్కర ప్రశంసలు

**జైపూర్, 27,**

యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో భారత క్రికెట్‌తో పాటు ప్రపంచ క్రికెట్‌లోనూ కీలక ఆటగాడిగా ఎదుగుతాడని రాజస్థాన్ రాయల్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ కుమార సంగక్కర విశ్వాసం వ్యక్తం చేశాడు. చిన్న వయసులోనే అతడిలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం, ఆటపై ఉన్న అంకితభావం అసాధారణమని కొనియాడాడు. స్కై స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంగక్కర మాట్లాడుతూ, 2023లో జట్టు అనలిస్ట్ అక్షయ్ సూచనతో వైభవ్‌ను ట్రయల్స్‌కు పిలిచామని తెలిపారు. అప్పటి ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో కలిసి కేవలం ఐదు నిమిషాల పాటు అతడి బ్యాటింగ్‌ను పరిశీలించిన తర్వాత, "ఈ కుర్రాడిని తప్పకుండా జట్టులోకి తీసుకోవాలి" అని ద్రవిడ్ చెప్పినట్లు వెల్లడించారు.




గువాహటిలో జరిగిన శిక్షణ శిబిరంలో జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మల వేగవంతమైన బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు సీనియర్ బ్యాట ర్లు వెనుకడుగు వేసినా, అప్పుడే 14 ఏళ్ల వయసున్న వైభవ్ ధైర్యంగా క్రీజులోకి దిగాడని సం గక్కర గుర్తు చేశాడు. అతడు ఆడిన ప్రతి షాట్ తుపాకీ పేలిన ట్లుగా శబ్దం చేసేదని, అతడి ధై ర్యాన్ని చూసి ఆర్చర్ కూడా ఆశ్చ ర్యపోయాడని చెప్పాడు.

# ప్రపంచకప్‌లో కాబో వెర్డె చరిత్ర.. నాకౌట్‌కు అర్హత

**న్యూయార్క్, జూన్ 27**

ప్రపంచకప్-2026లో చిన్న దేశం కాబో వెర్డె చరిత్ర సృష్టించింది. ఆఫ్రికా ఖండంలోని అతి చిన్న దేశాల్లో ఒకటైన ఈ దేశం, కేవలం సుమారు ఐదు లక్షల ముప్పై వేల జనాభాతోనే ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరి ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. తొలి సారిగా ప్రపంచకప్‌లో పాల్గొన్న కాబో వెర్డె, గ్రూప్ దశను దాటి ముందంజ వేసిన జట్టుగా అరుదైన ఘనత సాధించింది. 2010లో స్లోవేకియా తర్వాత తొలి ప్రపంచకప్‌లోనే గ్రూప్ దశను అధిగమించిన తొలి జట్టుగా నిలిచింది. అలాగే 2006లో ఘనా తర్వాత నాకౌట్‌కు చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా కూడా గుర్తింపు పొందింది. గ్రూప్-హెచ్‌లో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియాలతో కలిసి బరిలోకి దిగిన కాబో వెర్డె, మూడు మ్యాచ్‌ల్లోనూ డ్రా ఫలితాలు నమోదు చేసింది. ఒక్క



విజయమూ సాధించకపోయినా మూడు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రౌండ్-32కు అర్హత సాధించింది. స్పెయిన్ రెండు విజయాలు, ఒక డ్రాతో అగ్రస్థానంలో నిలిచి తదుపరి దశకు చేరుకుంది. నాకౌట్ దశలో జులై 3న కాబో వెర్డె బలమైన అర్జెంటీనాతో తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఫుట్‌బాల్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిన్న దేశమైన కాబో వెర్డె మరో సంచలనం సృష్టిస్తుందా అనే చర్చ కొనసాగుతోంది. ఇక గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో ఉరుగ్వే ఒకటి--సున్నా తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఉరుగ్వేతో పాటు సౌదీ అరేబియా టోర్నీ నుంచి నిష్క్రమించాయి. మరోవైపు గ్రూప్-ఐలో ఫ్రాన్స్ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసిన ఫ్రాన్స్ నాలుగు--ఒకటి తేడాతో నార్వేపై విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచి నాకౌట్‌కు చేరుకుంది.



## అభిషేక్ అర్ధశతకం ఎందుకు రద్దైంది?

**డబ్లిన్, జూన్ 27**

ఐర్లాండ్‌తో జరిగిన తొలి ఇరవై ఓవర్ల మ్యాచ్‌లో భారత జట్టు ఓటమిపాలైనప్పటికీ, యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వరుసగా వికెట్లు పడుతున్న సమయంలోనూ ధాటిగా ఆడిన అతడు కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసినట్లు మొదట స్కోరు బోర్డులో నమోదైంది. దీనిపై భారత క్రికెట్ ఒనియంత్రణ మండలి కూడా అభినందనలు తెలియజేస్తూ సందేశాన్ని విడుదల చేసింది. అభిషేక్ కూడా తన అర్ధశతకాన్ని ఆనందంగా జరుపుకున్నాడు. అయితే కొద్దిసేపటికే అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏడో ఓవర్ చివరి బంతికి అభిషేక్ శర్మ ఔటైన అనంతరం స్కోరు బోర్డును సవరించారు. మొదట అతడి ఖాతాలో నమోదు చేసిన అర్ధశతకాన్ని రద్దు చేసి, వ్యక్తిగత స్కోరును 20 బంతుల్లో 49 పరుగులుగా మార్చారు. దీంతో అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. దీనికి కారణం భారత ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో నమోదైన ఒక పరుగు. మొదట ఆ పరుగును అభిషేక్ ఖాతాలో సింగిల్‌గా నమోదు చేశారు. అయితే అనంతరం మ్యాచ్ అధికారుల సమీక్షలో అది బ్యాట్‌కు కాకుండా బ్యాటర్ శరీరానికి తగిలి వచ్చిన పరుగుగా తేలింది. దీంతో దానిని బ్యాటర్ పరుగుగా కాకుండా అదనపు పరుగుల విభాగంలో నమోదు చేశారు. ఫలితంగా అభిషేక్ వ్యక్తిగత స్కోరు నుంచి ఒక పరుగు తగ్గిపోయి అర్ధశతకం రద్దైంది. అభిషేక్ ఔటైన తర్వాత భారత బ్యాటింగ్ పూర్తిగా కుప్పకూలింది. ఎనిమిది ఓవర్లలోనే మూడు వికెట్లకు 80 పరుగులు చేసిన జట్టు, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి 148 పరుగులకే ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ బ్యాటర్లు సమష్టిగా రాణించి 34 పరుగుల తేడాతో విజయాన్ని అందుకున్నారు.




## ఐర్లాండ్ విజయంలో భారత సంతతి పేసర్ మెరుపు

**బెల్‌ఫాస్ట్, జూన్ 27,. :**

భారత జట్టుపై ఐర్లాండ్ చారిత్రాత్మక టీ20 విజయం సాధించడంలో భారత సంతతికి చెందిన పేసర్ జై ముంద్రా కీలక పాత్ర పోషించాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే రెండు వికెట్లు తీసి జట్టు విజయానికి బాటలు వేశాడు. రాజస్థాన్‌లోని టోంక్‌కు చెందిన 29 ఏళ్ల జై ముంద్రా 2021లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ కోసం ఐర్లాండ్‌కు వెళ్లాడు. చదువుతో పాటు అక్కడి క్లబ్ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టు సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. భారత్‌తో జరిగిన తొలి టీ20లో ఓపెనర్ సంజూ శాంసన్‌ను బౌల్డ్ చేసిన జై ముంద్రా, ఆ తర్వాత శివం దూబే వికెట్ కూడా పడగొట్టి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అతని కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. జై ముంద్రా మొదట టాప్ ఆర్డర్ బ్యాటర్, స్పిన్నర్‌గా క్రికెట్ ప్రారంభించినా, తర్వాత పేసర్‌గా మారి తన ప్రతిభను నిరూపించాడు. లీన్‌స్టర్ క్రికెట్ క్లబ్ తరఫున అద్భుత ప్రదర్శన చేసి 2023లో ఐరిష్ సీనియర్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌తో సిమి సింగ్ తర్వాత ఐర్లాండ్ తరఫున ఆడిన రెండో భారత సంతతి క్రికెటర్‌గా జై ముంద్రా రికార్డు సృష్టించాడు.

# భాగ్యరాజ్‌కు వీడ్కోలు

**ఆ మూడు హిట్స్ వెనక ఆయన పాత్ర ఏంటి?**

చెన్నై, జూన్ 27

ప్రముఖ నటుడు, దర్శకుడు, రచయిత కె. భాగ్యరాజ్ శనివారం ఉదయం చెన్నైలో గుండెపోటుతో కన్ను మూశారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు తమిళ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన భాగ్యరాజ్ మరణవార్త తమిళంతో పాటు తెలుగు సినీ పరిశ్రమను కూడా విషాదంలో ముంచెత్తింది. ఇటీవలే ప్రముఖ దర్శకుడు భారతీరాజా మరణంతో దిగ్భ్రాంతికి గురైన తమిళ సినీ ప్రపంచానికి, ఇప్పుడు భాగ్యరాజ్ మరణం మరో తీరని లోటుగా మారింది. ఆయన మృతి పట్ల సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. భాగ్యరాజ్‌ను భారతీయ సినీ పరిశ్రమలో 'స్క్రీన్‌ప్లే కింగ్'గా అభిమానులు, సినీ విమర్శకులు కొనియాడేవారు. కుటుం బ కథలు, హాస్యం, ప్రేమ, సామాజిక అంశాలను సమతు ల్యం గా మేళవిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే కథలను రూపొందించడంలో ఆయనకు ప్రత్యేకమైన శైలి ఉండేది. మధ్యతరగతి కుటుంబాల జీవన విధానాన్ని సహజంగా తెరపై ఆవిష్కరించడం, చమత్కారమైన సంభాషణలు, భావోద్వేగభరితమైన కథనాలతో ఆయన చిత్రాలు ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాయి. 1979లో విడుదలైన 'సువరిల్లాద చిత్రంగల్' సినిమాతో దర్శకుడిగా పరిచయ మైన భాగ్యరాజ్, తొలి చిత్రంతోనే విమర్శకుల ప్రశంసలు అందుకుని, ఆ తర్వాత వరుస విజయాలతో తమిళ సినీ పరిశ్రమలో అగ్ర దర్శకుల సరసన నిలిచారు. తెలుగు ప్రేక్షకులతోనూ భాగ్యరాజ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన కథల ఆధారంగా రూపొందిన అనేక తమిళ చిత్రా లు తెలుగులో రీమేక్ అయ్యాయి. విక్టరీ వెంకటేష్ నటిం చిన 'సుందర కాండ', 'అబ్బాయిగారు', 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు' వంటి చిత్రాలకు ఆయన కథను అందించారు. 'అబ్బాయిగారు' చిత్రానికి స్వయంగా దర్శక త్వం కూడా వహించారు. కుటుంబ కథలను హృద్యంగా చెప్పే ఆయన రచనా శైలి తెలుగు ప్రేక్షకులను కూడా విశేషంగా ఆకట్టుకుంది. దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా భాగ్యరాజ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపా దించారు. దాదాపు 75కు పైగా చిత్రాల్లో నటించి సహజ మైన అభినయంతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తన చిత్రాల్లో సాధారణ మనిషి పాత్రలకు జీవం పోస్తూ ప్రత్యేక మైన ఇమేజ్‌ను ఏర్పరుచుకున్నారు.



**సినిమా రంగం కంటే చదువుపై ఆసక్తి ఎక్కువ:**

# పూనమ్ కౌర్

హైదరాబాద్, జూన్ 27

తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి పూనమ్ కౌర్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాను సినిమాల్లోకి అనుకోకుండా వచ్చానని, అసలు తన లక్ష్యం వేరే రంగమని ఆమె వెల్లడించారు. చిన్నప్పటి నుంచే సినిమాలపై పెద్దగా ఆసక్తి లేకపోయిందని పూనమ్ కౌర్ తెలిపారు. తన తల్లి పడిన కష్టాలను చూసి, ప్రభావవంతమైన లాయర్‌గా మారాలని కలలు కన్నానని ఆమె పేర్కొన్నారు. కపిల్ సిబల్, రామ్ జెఠ్మలానీ వంటి ప్రముఖ లాయర్లలా ఎదగాలనేది తన లక్ష్యమని చెప్పారు. ఒక సందర్భంలో తాము నివసించిన భవనం తమ తండ్రిదని, ఆయన మరణానంతరం ఆస్తి కోసం తన తల్లి ఏడేళ్ల పాటు పోరాడాల్సి వచ్చిందని పూనమ్ గుర్తుచేసుకున్నారు. ఈ అనుభవాలే తనను న్యాయ రంగం వైపు ప్రేరేపించాయని తెలిపారు.







# తప్పుడు ప్రచారంపై విష్ణు విశాల్ ఆగ్రహం


చెన్నై, జూన్ 27

సామాజిక మాధ్యమాల్లో సినీ ప్రముఖులపై జరుగుతున్న నిరాధార ప్రచారం, ట్రోలింగ్‌పై కోలీవుడ్ నటుడు విష్ణు విశాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నటుడు రజనీకాంత్ వెంటనే శుభాకాంక్షలు తెలియజేయకపోవడంతో, విజయ్ ఎదుగుదలను చూసి రజనీకాంత్ అసూయపడుతున్నారంటూ ప్రచారం సాగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రముఖులపై తప్పుడు కథనాలు సృష్టించడం బాధాకరమని అన్నారు. తన తాజా చిత్రం 'మట్టి కుస్తీ--2' ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న విష్ణు విశాల్ మాట్లాడుతూ, రజనీకాంత్ విజయ్‌పై అసూయతో ఉన్నారనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. సినీ ప్రముఖులు కొద్దిరోజులు ఏ విషయంపైనా స్పందించకపోతే వెంటనే వారిపై రకరకాల ఊహాగానాలు ప్రచారం చేయడం ఇటీవలి కాలంలో అలవాటుగా మారిందని పేర్కొన్నారు. రజనీకాంత్ విషయంలోనూ అదే జరిగిందని, ఆయన మౌనాన్ని తప్పుగా అర్థం చేసుకుని చివరకు స్వయంగా వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా భారతీయ సినీ పరిశ్రమలో అగ్రస్థానంలో కొనసాగుతున్న రజనీకాంత్ సాధించిన విజయాలు, అందుకున్న గౌరవం అసాధారణమని విష్ణు విశాల్ అన్నారు. అలాంటి దిగ్గజ నటుడు మరొకరి ఎదుగుదలను చూసి అసూయపడతారని చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. సినీ రంగంలో వృత్తిపరమైన పోటీ సహజమే కానీ, దానిని వ్యక్తిగత విభేదాలుగా చిత్రీకరించడం సరైన పద్ధతి కాదని సూచించారు. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఈ వివాదంపై స్పందించిన రజనీకాంత్ కూడా తనపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. విజయ్ ముఖ్యమంత్రి కావడం పట్ల తనకు ఎలాంటి అసూయ లేదని, ప్రస్తుతం తాను ఏ వ్యాఖ్య చేసినా దానిని వక్రీకరించి వివాదాలు సృష్టిస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

# సోషల్ మీడియా సెన్సేషన్‌గా దీప్తి సునయన

హైదరాబాద్, జూన్ 27

సోషల్ మీడియా ప్రభావంతో కొత్త తరం సెలబ్రిటీలు వేగంగా వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు మరోసారి సోషల్ మీడియా సెన్సేషన్ దీప్తి సునయన పేరు నెట్టింట వైరల్‌గా మారింది. ఒక్క సినిమా కూడా చేయకుండానే భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, కుర్రాళ్లలో ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకుంది. డబ్‌స్మాష్ వీడియోలతో మొదలైన దీప్తి సునయన ప్రయాణం, తర్వాత టిక్‌టాక్ వీడియోలు, యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్‌ వరకు విస్తరించి ఆమెను సోషల్ మీడియా స్టార్‌గా మార్చింది. ఆమె చేసిన ప్రతి పోస్ట్‌కు వేలల్లో లైక్స్, కామెంట్స్ వస్తుండటంతో ఆమెకు ఉన్న పాపులారిటీ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. తరువాత బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన దీప్తి సునయన, ఆ షో తర్వాత కూడా షార్ట్ ఫిల్మ్‌, కవర్ సాంగ్స్ చేస్తూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా కొనసాగుతోంది. సినిమాల్లో హీరోయిన్‌గా అవకాశాలు వస్తాయని అభిమానులు భావించినప్పటికీ, ప్రస్తుతం ఆమె పూర్తిగా సోషల్ మీడియా కంటెంట్‌పైనే దృష్టి పెట్టింది. చీరకట్టులోనూ, మోడ్రన్ లుక్‌లోనూ తన అందచందాలతో ఆకట్టుకుంటూ యువతను మంత్రముగ్ధులను చేస్తున్న దీప్తి సునయన, సోషల్ మీడియా వేదికగా తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతూ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చాయి.



## వృషకర్మతో నాగ చైతన్య కొత్త ప్రయాణం

**ఇప్పటికీ ఆమెతోనే బెస్ట్ కెమిస్ట్రీ..!**

హైదరాబాద్, జూన్ 27

అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య వరుస విజయాలతో మంచి ఫామ్‌లో కొనసాగుతున్నారు. కంటెంట్ ప్రధానంగా ఉన్న సినిమాలను ఎంచుకుంటూ హిట్స్ అందుకుంటున్న ఆయన, చివరిగా విడుదలైన 'తండేల్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం నాగ చైతన్య పీరియాడికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు 'వృషకర్మ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. జెట్ స్పీడ్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, నాగ చైతన్య గతంలో చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్‌గా మారింది. తన కెరీర్‌లో నటించిన హీరోయిన్లలో ఎవరి కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని అడిగిన ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం నెటిజన్లను ఆశ్చర్యానికి గురి చేసింది. దాదాపు 27 సినిమాల్లో, 20కి పైగా హీరోయిన్లతో నటించిన నాగ చైతన్య, ఎలాంటి తడబాటు లేకుండా హీరోయిన్ కృతిశెట్టితో కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్య ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నాగ చైతన్య సాయి పల్లవి, సమంత, తమన్నా, రాశి ఖన్నా వంటి స్టార్ హీరోయిన్లతో కలిసి నటించినప్పటికీ కృతిశెట్టి పేరు చెప్పడం విశేషంగా మారింది. కృతిశెట్టితో ఆయన 'బంగార్రాజు', 'కస్టడీ' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467